ఇంఘోల్లు.. రానంటున్న బస్సు

- ఆర్టీసీ నిర్వాకం ప్రైవేట్ బస్సులు ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- ఇంకొల్లు బస్టాండుకు బస్సులు ఎత్తేసిన ఆర్టీసీ
- దూర ప్రాంతాలకు బస్సులు లేక ప్రజల ఇక్కట్లు
- కూటమి ప్రభుత్వం నిర్వాకంతో ప్రజల అవస్థలు


బస్టాండులో నిలిపి ఉంచిన ఆటోలు

ఇంకొల్లు (చినగంజాం): ప్రయాణికులే మా దేవుళ్లు.. అని చెప్పుకునే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారికి సేవలు అందించడంలో విఫలమవుతున్నారు. రాజకీయ నాయకుల సభలకు బస్సులు ఏర్పాటు చేయడంలో ఉన్న ఆసక్తి ప్రయాణికులకు సేవలందించడంలో ఉంచడం లేదనే విమర్శ ప్రజలలో వెల్లువెత్తుతోంది. బస్సులు సకాలంలో ప్రయాణికులకు అందుబాటులో లేకపోవడంతో అధిక ధరలు వెచ్చించి మరీ ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో సభలకు పంపుతూ ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నారు. ఆక్యుపెన్సీ, ఆదాయం పెంపు వంటి మాటలు ఆర్టీసీ అధికారులకు గుర్తుకు రావడం లేదా అంటూ ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రయాణికులు రద్దీ ఎక్కువగా ఉంటుందని బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ప్రయాణికులు పలు మార్లు అభ్యర్థిస్తున్నప్పటికీ బస్సులు అందుబాటులో లేవని, ఆక్యుపెన్సీ ఉండటం లేదని, రోడ్లు బాగోలేవంటూ పలు సాకులు చెప్తూ అధికారులు తప్పించుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు సంక్షేమం దిశగా బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మేజర్ బస్టాండ్‌కు బస్సు సౌకర్యం కరువు

ఇంకొల్లు పట్టణంలోని బస్సు స్టాండ్ ఆర్టీసీకి మేజర్ బస్టాండ్ కాగా ప్రతి నిత్యం సుమారు 5 వేల మంది ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరుతుంటారు. ఒంగోలు, గుంటూరు, చీరాల, చిలకలూరిపేట, అద్దంకి ప్రాంతాల నుంచి గతంలో 25 బస్సులు వరకు సర్వీసులను గతంలో నడిపేవారు. ఇంకొల్లు బస్టాండుకు ఉన్న రద్దీని దృష్టిలో ఉంచుకొని ఒక్కో బస్సు రోజుకు 7 ట్రిప్పులు వరకు నడిపేవారు. కరోనాకు మునుపు ఇంకొల్లు బస్టాండుకు ఏడు నైట్ హాల్ట్ బస్సులు ఉంటే కరోనా తరువాత నైట్ హాల్ట్ సర్వీసులను పూర్తిగా ఎత్తి వేశారు. కరోనా దాటి పోయి రెండేళ్లయినా ఇంతవరకు ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను పునరుద్ధరించ లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు అవస్థలు అంతఇంత కాదు. నియోజకవర్గంలో ఇంతవరకు ఒక్క బస్ డిపో లేకపోవడం శోచనీయం.

దూర ప్రాంతాలకు పూర్తిగా ఎత్తివేత..

ఇంకొల్లు బస్టాండు నుంచి గతంలో హైదరాబాద్‌కు రెండు బస్సులను రోజూవారిగా నడుపుతుండేవారు. ప్రస్తుతం రెండు బస్సులను నిలిపివేయగా అన్ సీజన్ పేరుతో చీరాల నుంచి ఇంకొల్లు మీదుగా బెంగళూరుకు నడిపే సర్వీస్‌ను రద్దు చేసి ఇంత వరకు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోలేదు. హైదరాబాద్, బెంగళూరు, నెల్లూరు, తిరుపతి వంటి దూర ప్రాంతాలకు బస్సులు లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఏర్పడిన రాజధాని అమరావతికి, ఇతర పుణ్యక్షేత్రాలకు వెళ్ళేందుకు సైతం బస్సులు లేకపోవడం గమనార్హం. ఇప్పటికై నా ఆర్టీసీ అధికారులు ప్రజల సంక్షేమ దిశగా బస్సులు నడపాలని, ప్రజలకు అందుబాటులోకి బస్సుల సౌకర్యాన్ని కల్పించాలని వారు కోరుతున్నారు.

> **ప్రయాణికుల సంక్షేమ దృష్టితో బస్సులు నడపాలి..**
>
> 
>
> ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంకొల్లు బస్‌స్టాండ్ కు బస్సులు ఏర్పాటు చేయాలి. ఇంకొల్లు బస్టాండ్ నుంచి రోజుకు సుమారు వేల సంఖ్యలో ప్రయాణికులు దూరప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. అయితే ఆర్టీసీ అధికారులు కరోనా తర్వాత గతంలో దూరప్రాంతాలకు ఉన్న బస్సులను సైతం తొలగించారు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు రాజకీయ నాయకుల సభలకు బస్సులను పంపించేందుకు చూపే ఆసక్తి ప్రయాణికుల సౌకర్యం పై దృష్టి సారిస్తే బాగుంటుంది.
>
> – అన్నంబొట్ల మోహన్‌కృష్ణ, ఇంకొల్లు ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు

రైతులను సన్మానించుకోవడం అదృష్టం

కారంచేడు: ఎన్నో కష్టనష్టాలను, ఆటుపోట్లను సైతం తట్టుకుంటూ ముందుకు వెళ్తున్న అన్నదాతలను రైతు పండుగ సంక్రాంతికి సన్మానించుకోవడం ఎంతో అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని స్వర్ణ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామంలో స్వర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆటపాటలు, ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం అదే వేదికపై గ్రామానికి చెందిన తవ్వా సుబ్బరావమ్మ జ్ఞాపకార్థం కుమారుడు శ్రీనివాసరావు, ఈపురుపాలెం హెచ్‌ఎం వెంకటయోగి సుధారాణి దంపతులు గ్రామానికి చెందిన సుమారు 25 మంది రైతులను ఘనంగా సన్మానించారు. వ్యవసాయం చేయడానికి ముందుకురాని ఈ రోజుల్లో అనేక మంది తమ సొంత భూముల్లో నేటి తరాలకు ఆదర్శంగా నిలచేలా సాంకేతికను అందిపుచ్చుకుంటూ వ్యవసాయం చేస్తున్నారన్నారు. అందుకు వారిని గుర్తించి వారిని సన్మానించామన్నారు. కార్యక్రమంలో స్వర్ణ సేవా సమితి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.


స్వర్ణలో ఆదర్శ రైతులను సన్మానిస్తున్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

హెల్త్ పింఛన్‌ల పరిశీలన


పింఛన్‌దారుడిని పరిశీలిస్తున్న డాక్టర్

కారంచేడు: మండలంలోని స్వర్ణ, దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సుమారు 18 మంది హెల్త్ పింఛన్‌దారులను వైద్యాధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ కే నేతాజీ పర్యవేక్షణలో గుంటూరు నుంచి వచ్చిన వైద్య బృందం స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలోని 10 మందికి, దగ్గుబాడు పీహెచ్‌సీ పరిధిలోని 8 మందిని వారు క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను తయారు చేశారు. స్థానికంగా డాక్టర్ షాలినీ, డాక్టర్ హస్మప్రియ, హెచ్‌ఈఓ వీ నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉప ఖజానా కార్యాలయం నుంచి ప్రతి నెల పింఛన్ తీసుకునే విశ్రాంత ఉద్యోగులు విధిగా లైఫ్ సర్టిఫికెట్లు ఫిబ్రవరి 28లోగా ఉపఖజానా కార్యాలయంలో అందించాలని ఎస్టీవో సుబ్బారావు గురువారం ప్రకటనలో సూచించారు. చీరాల ఉపఖజానా కార్యాలయం పరిధిలోని చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు మండలాలకు చెందిన ఉద్యోగులకు జీతాల బిల్లులు త్వరగా పంపిస్తున్నామన్నారు. ఉప ఖజానా కార్యాలయ పరిధిలో ఉన్న 3395 మంది విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లను కార్యాలయంలో అందించాలన్నారు.

అద్దంకి సీఐ బాధ్యతల స్వీకరణ


సుబ్బరాజు, సీఐ

అద్దంకి రూరల్: అద్దంకి సీఐగా ఏ సుబ్బరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. తొలుతగా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్టేషన్‌కు వచ్చి బాధ్యతలు చేపట్టారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎం. కృష్ణయ్య వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బరావు విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్యపై దృష్టిపెడతానన్నారు. 2017 నుంచి 2019 వరకు అద్దంకిలో ఎస్సైగా పనిచేసిన నాకు సీఐగా ఇక్కడికి రావడం ఆనందంగా ఉందన్నారు.

11 మద్యం సీసాలు స్వాధీనం

చీరాల: ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఒంగోలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాపట్ల జిల్లా ఆదేశాల మేరకు చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు గురువారం ఎక్సైజ్ ఎస్సై బి.శ్రీహరి వేటపాలెం మండలంలోని పలు ప్రాంతాలలో దాడులు నిర్వహించారు. వేటపాలెం మండలం జబ్బార్‌కాలనీలో టీషాపు వద్ద సారికొక్కు బాబూరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నారు.

బైబిల్ గ్రంథాలు పంపిణీ

చీరాల రూరల్: ఇంటర్‌నేషనల్ గిడియన్స్ చీరాల క్యాంప్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి వద్ద కొత్త నిబంధనకు సంబంధించిన 1400 బైబిల్ గ్రంథాలను పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ గిడియన్స్ ఆధ్వర్యంలో 200 దేశాలలో ఆయా భాషల్లో బైబిల్ గ్రంథాలను అందుబాటులో ఉంచాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో నడవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏడి వై. ప్రకాష్, సిపి వై. జాన్సన్, విడిఐ జాక్సన్, వి. జయకుమార్, కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

వర్గీకరణలో ఎస్సీలంతా మాదిగలే


మాట్లాడుతున్న పేతురు మాదిగ

బల్లికురవ: ఎస్సీ వర్గీకరణలో ఎస్సీ కులస్తులంతా మాదిగలేనని.. క్రిస్టియన్‌లు కాదని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కందుకూరు పేతురు మాదిగ అన్నారు. వర్గీకరణలో భాగంగా గురువారం వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, గుంటుపల్లి సచివాలయాల్లో నమోదైన పేర్లను పరిశీలించారు. ఎస్సీలు క్రిస్టియన్‌లుగా నమోదవడం పట్ల ఆధార్, కుల ధ్రువీకరణతో సరిచేయిస్తున్నట్లు చెప్పారు. తామంత మాదిగలమేనని ఆయా గ్రామాల్లోని ఎస్సీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందా రాంబాబు, రంగయ్య, రామయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

వేటపాలెం: మండల పరిధిలోని రామన్నపేట శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 3 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్న ఏడుగురిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. జూదాలు నిర్వహించినా, ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

భూసార పరీక్ష ఆధారంగా పంటల సాగు


వెంపరాలలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి


ఆరికట్లవారిపాలెంలో శనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు


బల్లికురవ: రైతులతో మాట్లాడుతున్న ఏవో కుమారి

జే.పంగులూరు: భూసార పరీక్షల అధారంగా పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి డి సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆరికట్లవారిపాలెం, రేణింగవరం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేసి పంటలు వేయడం ద్వారా ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గుతుందన్నారు. పచ్చిరొట్ట పంటలపై జీలుగ, జనుము, పిల్లిపెసర సాగు చేసి పూత దశకు వచ్చినప్పుడు భూమిలో కలియదున్నటం వలన భూమిలో కార్బన్ శాతం పెరుగుతుందని తద్వారా నేల ఆరోగ్యంగా ఉండి పంటు దిగుబడులు పెరుగుతాయన్నారు. రైతులు సాగు చేసిన శనగ, మొక్కజొన్న, మిరప పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం అధికారులు ఎం అలెగ్జాండర్, కె శివాని, రైతులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలి..

బల్లికురవ: రబీలో జనవరి 31లోపు సాగేచేసే పంటలన్నింటిని ఈ పంటలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి ఎస్‌వీపి కుమారి కోరారు. గురువారం కొత్తూరు, వెలమవారిపాలెం గ్రామాల్లో వరి, మొక్కజొన్న పొలాలను పరిశీలించి చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ పంట నమోదుతో పంట ఉత్పత్తులను అమ్ముకోవటంతోపాటు, విపత్కర పరిస్థితుల్లో పరిహారం పొందవచ్చన్నారు.

అద్దంకి రూరల్: వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని వెంపరాల, చక్రాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3 జి గుళికలు ఎకరాకు 5 కేజీలు చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు శేషయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు అందించేందుకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల టౌన్: నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికి నివేశన స్థలాలు అందించేందుకు కృషి చేస్తున్నాని.. అధికారులు భూ సేకరణ చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశించారు. గురువారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పేదలకు నివేశన స్థలాల కోసం భూ సేకరణ చేయాలన్నారు. అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదన్నారు. చీరాలలో ఇసుక విధానంపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అధికారులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో తహశీల్దార్లు కుర్రా గోపీకృష్ణ, పి.పార్వతి, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ , డీఐవో ఎ.ముసలయ్య, హౌసింగ్ ఏఈ శ్రీను, మెప్మా సీఎంఎం చినకొండయ్య, అధికారులు పాల్గొన్నారు.

కులదూషణపై ఫిర్యాదు

బల్లికురవ: మండలంలోని కొత్తూరు గ్రామంలో ఇరువురు యువకుల మధ్య తలెత్తిన వివాదం కుల దూషణకు దారి తీసింది. గ్రామానికి చెందిన యాకోబుపై అదే గ్రామానికి చెందిన గోవర్ధన్ మరి కొందరు కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారని బాధితుడు గురువారం బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేయటంలో తాత్సరం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు కందుకూరు పేతురు మాదిగ అన్నారు. కుల దూషణతో దాడి చేసిన వ్యక్తులపై చట్టపరంగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేడుకగా సీతారామస్వాముల తెప్పోత్సవం


తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎలక్ట్రికల్ ప్రభ

మార్టూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గురువారం సాయంత్రం తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. కనుమ పండుగ మరుసటి రోజు ద్రోణాదులలో తెప్పోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా గ్రామంలోని రెండు ప్రధాన ఆలయాల్లోని సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వాములు, అలాగే వీరభద్రుడు, సోమేశ్వరస్వాముల ఉత్సవ విగ్రహాలను పూజారుల ప్రత్యేక పూజల అనంతరం గ్రామస్తులు వెంటరాగా గ్రామంలోని ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించి గ్రామానికి తూర్పు వైపున గల చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవం కనుమ పండుగ మరుసటి రోజు కావడంతో చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాత్రి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యార్థులు నిర్వహించిన కోలాట ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది. గ్రామ ప్రధాన సెంటర్‌లో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సోలార్ ఏర్పాటుతో విద్యుత్ ఆదా

పర్చూరు (చినగంజాం): ఇంటిపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే కరెంటు బిల్లులు గణనీయంగా తగ్గుతాయని పర్చూరు ఏడీఈ రమేష్ గురువారం తెలిపారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకంలో భాగంగా ఇంటిపై ఐదు కిలో వాట్‌ల సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకునేందుకు రూ.3.40 లక్షలు వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఐదు కిలో వాట్‌ల సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రూ.75 వేలు సబ్సిడీ కూడా అందిస్తుందని ఆయన వివరించారు. సోలార్ ఏర్పాటు చేసుకుంటే గతంలో కంటే కరెంటు బిల్లులు 80 శాతం తగ్గుతుందన్నారు. మిగులు కరెంటుకు సంబంధించిన నగదు కూడా మన ఖాతాలో జమచేస్తారని తెలిపారు. అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ఇంకొల్లు (చినగంజాం): పాఠశాలకు పూర్వవిద్యార్థి సాయం అందించాడు. పూసపాడు హైస్కూల్‌కు వంకాయలపాడుకు చెందిన పూర్వ విద్యార్థి పిడవర్తి మహేష్ రూ.42 వేలు విలువైన కంప్యూటర్, ప్రింటర్ బహూకరించాడు. మండలంలోని పూసపాడు ఎస్‌కేవీఎస్ హైస్కూల్ పాఠశాల నందు 2006–07 బ్యాచ్‌కి చెందిన 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి పిడవర్తి రామస్వామిరెడ్డి కుమారుడు పిడవర్తి మహేష్ పాఠశాల విద్యార్థుల వాటిని అందజేశారని పాఠశాల హెచ్‌ఎం కే శ్రీనివాసరావు తెలిపారు. దాత మహేష్‌ను పాఠశా కరస్పాండెంట్ జీఎల్‌కే ప్రసాద్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

సెల్ టవర్ సమస్యపై విచారణ


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శివన్నారాయణ

ఇంకొల్లు (చినగంజాం): సెల్ టవర్ నిర్మాణంతో ఏర్పడిన సమస్యపై లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ చేశారు. ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మాణం చేసిన సెల్ టవర్‌పై గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీఓ శివనారాయణ గురువారం విచారణ చేశారు. టవర్ నిర్మాణం కోసం 2018లో ఇచ్చిన అనుమతులు, గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుకు సంబంధించి వివరాలను ఉన్నతాధికరులకు తెలియజేస్తామని డీఎల్‌పీఓ తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు మోహన్‌బాబు, కోటి నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల కోసం దరఖాస్తు

చినగంజాం: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల కోసం దివ్యాంగుల మండల సమాఖ్యకు దరఖాస్తు చేసుకోవాలని సమాఖ్య సభ్యులు గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని దివ్యాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో చెవిటి మిషన్‌లు, వీల్ చైర్స్, చేతి కర్ర, నడుము, మెడకు బెల్ట్, ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హులు వారి ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్, ఫోటో, 60 ఏళ్లలోపు వారు సదరన్ సర్టిఫికెట్ తీసుకొని ఈ నెల 17,18,19 తేదీల్లో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని సభ్యులు మార్పు విశ్రాంతమ్మ, కుర్మాల సురేష్ బాబు, వడ్లమూడి వేణు, మెడబలిమి చిట్టిబాబు, ములుగు హనుమంతరావులు తెలియజేశారు. వివరాల కోసం 99893 48332 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా కోరారు.

రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలు దూరం



మాట్లాడుతున్న డీఎం శ్యామల

చీరాల అర్బన్: రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని డిపో మేనేజర్ జె.శ్యామల అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒన్‌టౌన్ ట్రాఫిక్ ఎస్సై పవన్‌కుమార్ హాజరయ్యారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు గురువారం నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ట్రాఫిక్ ఎస్సై పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రయాణ సమయంలో చిన్న తప్పుల కారణంగా నిండు జీవితాన్ని కోల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు


క్షతగాత్రుడు ఈశ్వరచంద్రనాథ్

వేటపాలెం: వేగంగా వస్తున్న కారు లారీని తప్పించబోయి బైక్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈప్రమాదం 216 కత్తిపూడి– ఒంగోలు జాతీయ రహదారిలో సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల దగ్గరలో ఘటన గురువారం చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. పొన్నూరుకు చెందిన యల్లాప్రగడ మనోజ్ కారులో ఒంగోలు వైపు వెళ్తున్నాడు. ఈక్రమంలో కళాశాల దగ్గరకు రాగానే నిద్రమత్తు కారణంగా లారిని అధిగమించే క్రమంలో లారీ సైడుకు తగిలింది. దీంతో పక్కన వెళ్తున్న బైకును ఢీకొట్టడంతో పందిళ్లపల్లికి చెందిన పీ. ఈశ్వరచంద్రనాథ్, మరొకరు కిందపడి తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాలల శిబిరం


శిబిరానికి హాజరైన సండే స్కూలు టీచర్లు, ప్రముఖులు


క్యాంప్ ఫైర్‌లో నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

చీరాల రూరల్: చీరాలలోని సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ సంఘం (ఏఈఎల్‌సి) నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలల శిబిరం గురువారం వైభవంగా ముగిసింది. మూడు రోజులు పాటు నిర్వహించిన శిబిరంలో రాష్ట్రంలోని 83 లూథరన్ సంఘాల చర్చిలకు చెందిన నాలుగు వేల మంది చిన్నారులు పాల్గొన్నారు. మొదటి రోజు ప్రారంభోత్సవాన్ని ఏఈఎల్‌సీ తూర్పు గుంటూరు సినడ్ బిషప్ కూరాకుల రత్నమోహన్, ఏఈఎల్‌సి సెక్రటరి చిన్నం కిషోర్‌బాబు, ఏఈఎల్‌సి ప్రథమ మహిళ ఆషాకిరణ్ పరదేశిబాబుల చేతులు మీదుగా ప్రారంభించారు. శిబిరాలకు హాజరైన చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతి సౌకర్యాలను నిర్వహకులు కల్పించారు. కార్యక్రమాలకు ముందుగా చర్చి పాస్టర్లు రెవరెండ్ పిల్లి దేవదాసు, పోకూరి నానిబాబులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఎల్‌సి మోడరేటర్ బిషప్ పరదేశిబాబు, ఏఈఎల్‌సి సెక్రటరి చిన్నం కిషోర్‌బాబు, చర్చి చైర్మన్ ఆశోక్‌కుమార్ చర్చి ట్రెజరర్ పేర్లి ఆనంద్‌బాబు, క్యాంపు ట్రెజరర్ సంపత్, సండేస్కూలు సూపరింటెండెంట్ దేటా దివాకర్. తదితరులు పాల్గొన్నారు.